క్లుప్తంగా

రెండు రోజుల శిక్షణ

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు నిర్వహించనున్న శిక్షణ తరగతులను పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా? లేదా? ప్రభుత్వం వివిధ రకాలుగా పంపిణీ చేస్తున్న పథకాల తీరుపై గురు,శుక్ర వారాలు శిక్షణలో వివరిస్తారని తెలియజేశారు. ఈ శిక్షణకు నిర్దేశించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాలకొండ రూరల్: పట్టణంలోని విద్యుత్ ఉప కేంద్రం నిర్వహణ పనులు ఈ నెల 19న నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీకేజీకే మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు మండల పరిధిలోని తంపటాపల్లి, భాసూరు, మంగళాపురం, గోపాలపురం, బుక్కూరు, కొండాపురం, వెలగవాడ, లుంబూరు, అంపిలి గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సచివాలయాలకు చేరిన పోటీ పరీక్షల పుస్తకాలు



కొండాపురం గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉంచిన పోటీ పరీక్షల పుస్తకాలు

పాలకొండ: పోటీ పరీక్షలకు హాజరవుతున్న యువతకు ప్రభుత్వం తమ గ్రామంలోనే అన్ని వసతులు అందుబాటులోనికి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయల విలువ చేసే పుస్తకాలు ఉంచారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తున్న నేపథ్యంలో కాంపిటీటివ్ బుక్స్ గ్రామంలోనే అందుబాటులో ఉండడంతో నిరుద్యోగ యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో గంగిరెద్దుల సందడి



గంగిరెద్దుల ప్రదర్శన

భామిని: ముక్కనుమ సందర్భంగా గ్రామాల్లో గంగిరెద్దులు సందడి చేశాయి. సుందరంగా అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తీసుకెళ్లి, కుటుంబ సభ్యులు ఆశీర్వాదం ఇప్పించి పెంపకందారులు కానుకలు స్వీకరించారు. గంగిరెద్దుల విన్యాసాలతో చిన్నారులు సందడిగా గడిపారు. నేరడి-బి, గురండి, లోహరిజోల, వడ్డంగి గ్రామాలలో సామూహిక గంగిరెద్దుల ప్రదర్శనలు జరిగాయి.

దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు అందిస్తున్న సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు

పాలకొండ రూరల్: పట్టణంలోని వెంకటరాయుని కోనేటి గట్టుపై పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రంథాలయం వద్ద బుధవారం పేదలకు వస్త్రదాన కార్యక్రమం చేపట్టారు. నగర పంచాయతీ పరిధి ఎన్‌కే.రాజపురం గ్రామానికి చెందిన మిడితాన సూర్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలసి దుస్తులు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు జీపీడీపీ ప్రణాళికపై శిక్షణ

బాడంగి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

22న మండల సమావేశం

ఈ నెల 22న ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

ప్రజలందరి ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు జగన్నాథపురం ప్రాంతంలో గల పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే మొదటివిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎప్పుడూ లేని విధంగా స్పెషలిస్టు వైద్యులను గ్రామాలకు పంపి వైద్య పరీక్షలు నిర్వహించడంతో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరాలు ఆరు నెలలపాటు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమం జూన్ నెలాఖరు వరకు ఆరు నెలలపాటు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారని చెప్పారు. దీనికి అనుగుణంగా స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులను నియమించారని తెలిపారు. ప్రజల జీవన శైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాల్లో జీవన శైలి వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారని రక్తపోటు, మధుమేహం హైపోథైరాయిడ్, రక్త హీనత, గర్భకోశ వ్యాధుల వంటి వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి వైద్యులతో చికిత్స అందిస్తున్నారని, అవసరమైతే మందులు ఇంటికి తీసుకు వెళ్లి అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైద్యాధికారులు, వైద్యులు, వైద్యసిబ్బంది, రోగులు, స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జేఏఎస్-2 కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు

వికసిత్ భారత్ కరపత్రాల పంపిణీ చేయాలి



రంగంపేటలో వికసిత్ భారత్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేసి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు రంగంపేట సచివాలయం ప్రాంగణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆధీనంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు ఉద్యోగులు శాఖలవారీగా తెలియజేయాల్సి ఉందన్నారు. వికసిత్ భారత్ గ్రామసభల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం, వంటగ్యాస్ పొయ్యిలు ఉచితంగా పొందడానికి దరఖాస్తుల స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ కె.కుమారవర్మ, కాశీపేట సర్పంచ్ టి ధనుంజయమ్మ, ఆయాగ్రామాల కార్యదర్శులు, మురళి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పండగవాతావరణంలో ఆడుదాం ఆంధ్రా



బగ్గందొరవలస వాలీబాల్‌టీమ్



చినభోగిలి క్రికెట్ టీమ్

సీతానగరం: మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ విద్యాలయం, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో పండగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం జరిగాయి. ఆయా ప్రాంగణాల్లో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ ప్రారంభించగా అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల కార్యదర్శులు నిర్వహించారు. ఈ మేరకు అంటిపేట టీమ్ బ్యాడ్మింటన్‌లో గెలుపొందగా, వాలీబాల్ పోటీల్లో బగ్గందొరవలస టీమ్ గెలుపొందినట్లు కార్యదర్శులు తెలియ జేశారు. అలాగే కబడ్డీ పోటీల్లో పెదంకలాం సచివాలయం క్రీడాకారులు, బూర్జ క్రీడాకారుల మధ్య జరిగింది. క్రికెట్ పోటీలు చినభోగిలి-గెడ్డలుప్పి మధ్య జరగ్గా చినభోగిలి టీమ్, గాదెలవలస-లచ్చయ్యపేట జట్ల మధ్య జరగ్గా లచ్చయ్యపేట గెలుపొందినట్లు తెలియజేశారు. పెదభోగిలి-1 టీంతో ఆర్.వెంకంపేట టీమ్ తలపడగా పెదభోగిలి-1 టీం విజయం సాధించినట్లు తెలియజేశారు.

దిమ్మిడిజోలలో క్రీడాపోటీలు

భామిని: మండలంలోని దిమ్మిడిజోలలో ముక్కనుమ సందర్భంగా బుధవారం క్రీడాపోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల పేరిట వేదికలు ఏర్పాటు చేసి వివిధ సాంస్కృతిక పోటీలతో పాటు కబడ్డీ, ఖోఖో వంటి క్రీడా పోటీలు నిర్వహించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

రూ.323 కోట్లతో ఇంటింటా సంక్షేమం

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఈ నాగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో 1,10,118 మంది లబ్ధిదారులకు సుమారు రూ.323.05 కోట్లతో ఇంటింటా సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం వచ్చాక పేదల ఇంట పథకాల పంట పండాయన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, పంటల బీమా, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా, పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, కళ్యాణమస్తు, ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ బీమా, వాహన మిత్ర, తదితర సంక్షేమ పథకాల ద్వారా 84,695 మంది ఖాతాల్లో రూ.247.80 లక్షలు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. అలాగే ఇంటి పట్టాలు, విద్యాకానుక, ట్యాబ్‌లు, జగనన్న తోడు, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, తదితర పథకాల ద్వారా 25,423 మంది లబ్ధిదారులకు రూ.75.25 కోట్లు నాన్ డీబీటీ రూపంలో అందాయని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అర్హత ఉంటే పథకాలే గడపను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. ఇందులో దళారుల దందా, అధికారులు, సిబ్బంది చేతివాటం లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు చేరాయన్నారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి: రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు చీడపీడల నివారణకు జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం పీఆర్‌పీ రమాదేవి అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో బుధవారం రైతులకు జీవామృతం తయారీ విధానంపై ఐసీఆర్‌పీలతో అవగాహన కల్పించారు. ఒక ఎకరానికి జీవామృతం పిచికారీ చేయాలంటే ఆవుపేడ 5 కిలోలు, పశువుల మూత్రం 5 లీటర్లు, ఇంగువ ద్రావణం 200 గ్రాములు ఐదు లీటర్ల నీటిలో కలిపి ఒక తొట్టెలో నాలుగు రోజులు నిల్వ చేయాలి. ఉదయం, సాయంత్రం కర్రతో సవ్యదిశలో కలపాలి. ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం కలపాలి. 200 గ్రాముల ఇంగువ ఒక రెండు లీటర్ల నీటిలో బాగా మరగబెట్టి దానిలో ముద్ద ఇంగువ వేసి చక్కగా కలిపి చల్లారిన తరువాత ఇంగువ ద్రావణాన్ని పేడ మూత్రం ద్రావణంలో కలపాలి. ఈ ద్రావణాన్ని గుడ్డలో వడకట్టాలి. ఈ ద్రావణానికి 200 లీటర్ల నీటిని కలిపి ఒక ఎకరా పొలానికి పిచికారీ చేయవచ్చు. ఈ విధానాన్ని రైతులు తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారాన్ని పండించుకోవచ్చని వెల్లడించారు.

ముక్కనుమ వేడుకల్లో ఎమ్మెల్యే



ముక్కనుమ వేడుకల్లో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలో గల రెండవ, 19వ వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను పండగ సందర్భంగా కలిసి అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారికి స్వీట్స్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైస్‌చైర్మన్ కె.రుక్మిణి, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లం నాయుడు, చందక సూర్యప్రకాశ్, దేవి, రాహుల్ (బన్ను) కుమారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పార్వతీపురం పురపాలక సంఘం 20వ వార్డు అగ్రహారం వీధికి చెందిన లలితం వారి కుటుంబం పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్లే దారిలో మానాపురం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం సాయంత్రం మృతిచెందారు. ఈ విషయం బుధవారం స్థానిక నాయకుల ద్వారా ఈ తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు హుటాహుటిన అగ్రహారం వీధికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పుడే పోస్టుమార్టం ముగించుకుని విజయనగరం నుంచి పార్వతీపురం చేరుకున్న పార్థివ దేహాలకు శ్రద్ధాంజలి ఘటించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చుతూ తాము తప్పక అండగా నిలుస్తామని చెప్పి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం కన్వీనర్ చందాన ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఉన్నారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

చెరకు పనుల్లో రైతులు నిమగ్నం



పెదభోగిలిలో చెరకు ప్లాంటేషన్‌కు ఏర్పాటు చేసిన బోదెలు

సీతానగరం: మండలంలో వరిచేను పనులు తగ్గుముఖం పట్టడంతో చెరకు తరలింపు, చెరకు ప్లాంటేషన్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గ్రామాల్లో వరిచేను నూర్పిడి పనులు పూర్తి కావస్తుండడం, నూర్పు చేసిన ధాన్యం ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయడంతో వరిచేను పనులు తగ్గాయి.

దీంతో సంకిలి ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారానికి చెరకు తరలించడం, వరిచేను కోసిన భూమిలో చెరకు ప్లాంటేషన్ వేయడానికి రైతులు చదునుచేసిన అనంతరం బోదెలు(తారెలు), నీటి మళ్లింపునకు కాలువలు వేయడం తదితర పనులపై దృష్టి సారించారు. సంక్రాంతి పండగ ముగియడంతో చెరకు ప్లాంటేషన్ వేయడానికి బుడ్డిపేట, పెదభోగిలి, బూర్జ, వెంకటాపురం, తామరఖండి గ్రామాల రైతులు చెరకు పనుల్లో నిమగ్నమయ్యారు. చెరకు ప్లాంటేషన్ పనులపై బుధవారం మండల ఏఓ అస్ అవినాష్ వద్ద ప్రస్తావించగా రైతులు నీటి వనరులున్న గ్రామాల్లో చెరకు ప్లాంటేషన్ చేయడానికి మట్టి నమూనాలు చేశారన్నారు. అధిక దిగుబడినిచ్చే చెరకు విత్తనం గురించి రైతులకు వివరించినట్లు చెప్పారు.

ఆసరా ముందస్తు కార్యక్రమాలు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధుల విడుదలకు సంబంధించి ముందస్తు కార్యక్రమాలు చేపడుతున్నట్లు గుమ్మలక్ష్మీపురం వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆదయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈనెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా నిధులను విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో 18న ఆసరా లబ్ధిదారులతో జీవనోపాధులపై చర్చించనున్నట్లు చెప్పారు. 19,20 తేదీల్లో స్వయం సహాయక సంఘాలతో తీర్మానాలు చేసి బ్యాంకులను సమర్పించడం జరుగుతుందన్నారు.

21, 22 తేదీల్లో గ్రామైక్య సంఘం వారీగా సమావేశాలు నిర్వహించి ఆసరా నిధుల విడుదలపై సీసీలు చర్చిస్తారని, 23న ముఖ్యమంత్రి ఆసరా నిధులు విడుదల చేశాక.. 24 నుంచి 31 వరకు మండలంలో ఆసరా సంబరా లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు బుధవారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లోని ప్రజలకు జీపీడీపీ తయారీపై అవగాహన కల్పించడం, జీపీడీపీ తయారీ కమిటీని ఏర్పాటు చేసుకోవడం, గ్రామ పంచాయతీ అవసరాలు, సమస్యలను గుర్తించడం, ప్రాధాన్యత ప్రకారం పనులు నిర్ణయించుకోవడం, అందుబాటులో ఉండే వనరుల వివరాల తయారీ, కార్యాచరణ ప్రణాళిక తయారీ, ఆమోదం, అమలు తదితర అంశాలపై శిక్షణ, అవగాహన కల్పించారు. ఈనెల 19 వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంను సద్వినియోగించుకోవాలని, గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఈఓపీఆర్డీ జి.జగదీష్‌కుమార్ కోరారు.



జీపీడీపీ ప్రణాళికలు తయారీపై శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు

ప్రణాళిక ప్రకారం సేవలు

• ఎంపీపీ బొమ్మాళి భాను

పాలకొండ: గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎంతో ఉన్నత ఆశయంతో సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రజలకు పాలన చేరువ చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారని వివరించారు. ఆయన ఆశయం నెరవేరేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఎంపీడీఓ త్రినాథరావు మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

వార్షిక ప్రణాళికలతోనే అభివృద్ధి

భామిని: వార్షిక ప్రణాళికలతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జీపీడీపీలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో గుర్తించిన సమస్యల జాబితాలను సిద్ధం చేసుకుని నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో టీఓటీలు జి. భవానీశంకర్, కె.సంతోష్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులున్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తదితరులు



భామిని: అవగాహన కల్పిస్తున్న టీఓటీ భవానీశంకర్

గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

తెర్లాం:

గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాలను బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు తయారు చేయాలన్నారు. గ్రామాలకు సంబంధించి 29 అంశాలపై పనులు, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణ సాధించడానికి 9 అంశాలపై గ్రామాలను తీర్చిదిద్దాలని చెప్పారు. రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఎంఈఓ-2 పాపారావు, ఐసీడీఎస్ తెర్లాం, పెరుమాళి సెక్టార్ల సూపర్‌వైజర్ ఉషారాణి, మండల ఇంజినీరింగ్ అధికారి ఆర్నిపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీపీఎల్ విజేత 'బాయ్స్ రైడర్స్'

జియ్యమ్మవలస:

మండలంలోని పెదబుడ్డిడిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పెదబుడ్డిడి ప్రీమియర్ లీగ్ (పీపీఎల్)లో బాయ్స్ రైడర్స్ జట్టు విజేతగా నిలిచింది. 3 రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో భాగంగా బాయ్స్ రైడర్స్, రైజింగ్ స్టార్స్ మధ్య మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న బాయ్స్ రైడర్స్ నిరీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైజింగ్ స్టార్స్ 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయిన 89 పరుగులు మాత్రమే చేయగలిగింది. విజేత జ ట్టుకు రౌతు వాసుదేవరావు ట్రోఫీతో పాటు రూ.6500లు, రన్నరప్‌కు రూ.3500, మ్యాన్ ఆఫ్‌ది సిరీ స్‌గా నిలిచిన గుమ్మడి వైకుంఠకు కర్రి శివాజీ 3 తు లాల వెండి అందించారు. టోర్నీ అంపైర్‌గా వ్యవహరించిన రేవళ్ల రామకృష్ణను నిర్వాహకులు అభినందించారు.



విజయానందంలో బాయ్స్‌రైడర్స్ జట్టు